# తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871



తెలంగాణ వెన్నెల వాక్కు జాతీయ దినపత్రిక TELANGANAVENNELA WAKKU TGTEL/25/A0871

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో



హైదరాబాద్ సంపుటి : 02 సంచిక :48 02-09- 2026 బుధవారం పేజీలు: 4 వెల:03/-


# వెయ్యి రోజుల ప్రజా పాలన..
# వికాసం వైపు తెలంగాణ!

## రైతులు, మహిళలు, యువత, ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): విధ్వంసానికి గురైన తెలంగాణను వికాసం వైపు నడిపించేందుకు ప్రజా ప్రభుత్వం గడిచిన వెయ్యి రోజుల పాలనలో అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగుల సంక్షేమంతో పాటు కులగణన, ఎస్సీ వర్గీకరణ వంటి సామాజిక అంశాల్లోనూ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుందని వివరించారు. మూసీ నదిపై మూసారాంబాగ్ వద్ద నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని ప్రారంభించిన సందర్భంగా అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు.

‘ముళ్లబాట నుంచి హైవేకు తీసుకొచ్చాం’

తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడిన రాష్ట్రాన్ని గడిచిన వెయ్యి రోజుల్లో రూపాయి రూపాయి కూడబెట్టి ముళ్లబాట నుంచి హైవే వైపు తీసుకొచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తూ పరిపాలనను గాడిలో పెట్టామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న




అభివృద్ధిని చూసి ఓర్వలేని కొందరు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ ప్రభుత్వాన్ని సాఫీగా ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

ఉద్యోగులకు ప్రాధాన్యం

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరి 1 నుంచి ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని సీఎం తెలిపారు.

2

# భారత్--ఉజ్బెకిస్తాన్ బంధానికి కొత్త బలం

## సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం దిశగా కీలక అడుగు



అంతర్జాతీయ వార్త

మధ్య ఆసియా ప్రాంతంలో కీలకమైన దేశమైన ఉజ్బెకిస్తాన్‌తో భారత్ సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయి. ఇరు దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, రక్షణ, విద్య, వైద్యం, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించేందుకు చర్యలు వేగం పుంజుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇరు దేశాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం దిశగా ముందుకు సాగుతున్నాయి.

భారత్, ఉజ్బెకిస్తాన్‌ల మధ్య సంబంధాలకు శతాబ్దాల చరిత్ర ఉంది. పురాతన కాలంలో వాణిజ్య మార్గాల ద్వారా ఇరు ప్రాంతాల మధ్య వ్యాపార, సాంస్కృతిక సంబంధాలు కొనసాగాయి. ప్రస్తుతం ఆ బంధం వ్యూహాత్మక సహకారంగా రూపాంతరం చెందింది.

రక్షణ రంగంలో పెరుగుతున్న సహకారం

రక్షణ, ఉగ్రవాద నిర్మూలన,

2

# కవితక్క కన్నీళ్లు చూస్తే బాధేసింది..
# బోధన్ నుంచి పోటీ చేస్తానంటే వెల్‌కం:

## మాజీ ఎమ్మెల్యే షకీల్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

నిజామాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లో బోధన్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత షకీల్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై ఆయన చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు, ఆపై రాబోయే ఎన్నికల పొలిటికల్ సమీకరణాలపై ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలు జిల్లా రాజకీయాల్లో ఊహించని వేడిని రాజేశాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కవితక్క బోధన్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానంటే తాను మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తూ ఘన స్వాగతం పలుకుతానని మాజీ ఎమ్మెల్యే స్పష్టం చేయడం విశేషం. మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడిన షకీల్ అహ్మద్.. ఎమ్మెల్సీ కవితకు బోధన్ స్థానంతో ఉన్న పేగుబంధాన్ని, అనుబంధాన్ని గుర్తుచేశారు. కవిత భర్త అనిల్ స్వగ్రామం ‘పొత్తంగల్’ బోధన్ నియోజకవర్గం పరిధిలోనే ఉందనే విషయాన్ని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. ఆ రకంగా చూస్తే బోధన్ ప్రాంతం కవితక్కకు సొంత అత్తగారి ఊరు అవుతుందని, నియోజకవర్గానికి ఒక కోడలిగా ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు ఆమెకు పూర్తి అర్హత, సర్వహక్కులు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఒకవేళ రాబోయే ఎన్నికల్లో ఆమె బోధన్ బరిలో నిలిచేందుకు మొగ్గు చూపితే, తాను ఏమాత్రం అభ్యంతరం చెప్పకుండా




పూర్తిగా స్వాగతిస్తానని, ఆమె విజయం కోసం కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యానించారు.

ఇటీవల ఎమ్మెల్సీ కవిత ఒక కార్యక్రమంలో బహిరంగంగా కన్నీళ్లు పెట్టుకున్న ఘటనపై కూడా షకీల్ అహ్మద్ స్పందించారు. కవితక్క పబ్లిక్‌గా అంతలా కన్నీరు మున్నీరు కావడం చూసి తనకు ఎంతో వేదన కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. “ఒక చెల్లెలిగా ఆమె పడుతున్న బాధను చూసి నా మనసు కలచివేసింది. ఆ కన్నీళ్లు ఆమె వ్యక్తిగత బాధ (పర్సనల్ పెయిన్) వల్ల వచ్చి ఉండవచ్చు” అని పేర్కొన్నారు. అయితే, ఆమె కుటుంబంలో అసలు ఏం జరుగుతోంది, కల్వకుంట్ల కుటుంబంలోని అంతర్గత పరిస్థితులు ఏమిటనే విషయాలపై తనకు ఎలాంటి సమాచారం లేదని, ఆ విషయాలు తనకు తెలియవని దాటవేసారు.

నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా ప్రభావం చూపుతున్న కీలక నాయకుల్లో షకీల్ అహ్మద్ ఒకరు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు స్థానిక రాజకీయాల్లోనే కాకుండా సోషల్ మీడియా వేదికగానూ విపరీతంగా వైరల్ అవుతున్నాయి. బోధన్ నియోజకవర్గం నుంచి గతంలో ప్రాతినిధ్యం వహించిన షకీల్, స్వయంగా తనే వెనక్కి తగ్గి కవిత పోటీకి ఓకే చెప్పడం వెనుక ఉన్న రాజకీయం ఏమిటనే దానిపై రాజకీయ విశ్లేషకులు రకరకాల అంచనాలు వేస్తున్నారు.

ఈ క్రమంలోనే షకీల్ అహ్మద్ రాజకీయ భవిష్యత్తు మరియు రాబోయే అడుగులపై జిల్లా వ్యాప్తంగా కొత్త చర్చలు మొదలయ్యాయి. గత కొంతకాలంగా తెలంగాణలో

2

# తార్నాకలో తీవ్ర ఉద్రిక్తత:

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అరెస్ట్..

### కాంగ్రెస్ ప్రభుత్వంపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలోని తార్నాక ప్రాంతంలో మంగళవారం భారీ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఇటీవల నల్గొండ జిల్లాలో జరిగిన దాడి ఘటనలో బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడంతో ఈ ప్రాంతంలో హైటెన్షన్ నెలకొంది. శాంతిభద్రతల సమస్య నెపంతో పోలీసులు ముందస్తుగా ఆయనను గృహ నిర్బంధం (హౌస్ అరెస్ట్) చేసినప్పటికీ, ఆయన నల్గొండ పర్యటనకు బయలుదేరేందుకు యత్నించడంతో పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ పరిణామంతో బీజేపీ శ్రేణులు, పోలీసుల మధ్య తీవ్ర తోపులాట జరిగి ప్రాంతమంతా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం నిలిచి ఉందా లేదా అని తీవ్రంగా ప్రశ్నించారు. బాధితులను కనీసం పరామర్శించేందుకు వెళ్తున్న తమను ఇలా అక్రమంగా అరెస్టులు చేయడమేంటని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పతనానికి చాలా దగ్గరలో ఉందని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ ఇల్లు



మరియు కుటుంబంపై కాంగ్రెస్ నేతలు భౌతిక దాడులకు పాల్పడటం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఇటీవల పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై పరామర్శించేందుకు వెళ్లిన సందర్భంలోనూ పోలీసులు తనను దారిలోనే అడ్డుకున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు, ఆంక్షలు విధించినా, ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై బీజేపీ పోరాటం ఆపేది లేదని ఆయన స్పష్టం చేశారు.

మరోవైపు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి అరెస్ట్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులకు గురైన బాధితులను పరామర్శించేందుకు, ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న నాయకులను అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ దివాళా కోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. దాడులకు పాల్పడిన నిందితులను వదిలేసి, బాధితుల తరఫున నిలబడే వారిని కాపాడటమేనా కాంగ్రెస్ పార్టీ చెబుతున్న ‘ఇందిరమ్మ రాజ్యం’ అని నిలదీశారు.

నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడి ఇంటిని ధ్వంసం చేసిన వారిపై ఇప్పటివరకు పోలీసులు ఎందుకు కఠిన చర్యలు తీసుకోలేదని బండి సంజయ్ ప్రశ్నించారు. అంతేకాకుండా, హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంపై దాడికి తెగబడిన యూత్ కాంగ్రెస్ నేతలను పోలీసులు ఇప్పటివరకు ఎందుకు అరెస్ట్ చేయలేదని సీరియస్ అయ్యారు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం, పోలీసులు ఉండి ఏం చేస్తున్నారని నిలదీశారు.

అక్రమంగా అరెస్ట్ చేసిన బీజేపీ

2

# ప్రసాదం అంటే కేవలం తినే పదార్థమేనా?

దేవుడి దర్శనం పూర్తయిన తర్వాత భక్తులు ఎంతో భక్తితో ఎదురుచూసేది ప్రసాదం కోసం. ఆలయంలో ఇచ్చే చిన్న లడ్డూ కావచ్చు.. పులిహోర కావచ్చు.. పంచామృతం కావచ్చు.. లేదా ఒక చిన్న ముక్క ప్రసాదం కావచ్చు. పరిమాణం ఎంత చిన్నదైనా దాన్ని భక్తులు ఎంతో పవిత్రంగా స్వీకరిస్తారు. ఇంటికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులతో పంచుకుంటారు. పిల్లలకు ప్రేమగా అందిస్తారు. అసలు ప్రసాదానికి ఇంతటి ప్రత్యేకత ఎందుకు వచ్చింది?

ప్రసాదం అంటే కేవలం దేవుడికి సమర్పించిన ఆహారం కాదు. "ఇది నాకు లభించిన దైవానుగ్రహం" అనే భావంతో స్వీకరించే ఒక పవిత్రమైన గుర్తు. దేవుడికి ముందుగా సమర్పించి, అనంతరం భక్తులకు పంచడం వెనుక మనిషిలో కృతజ్ఞత, వినయం, పంచుకునే గుణం పెంచే ఒక గొప్ప ఆధ్యాత్మిక భావన ఉంది. మనిషి సాధారణంగా తనకు లభించినది తనదేనని భావిస్తాడు. కానీ నైవేద్యం సమర్పించే సమయంలో "ముందుగా నీకే సమర్పిస్తున్నాను" అనే భావన వస్తుంది. మనకు లభించిన ఆహారం, సంపద, సంతోషం.. ఇవన్నీ మన శ్రమతో వచ్చినప్పటికీ, వాటికి అనేక కారణాలు ఉన్నాయని గుర్తుచేసే సంప్రదాయం ఇది. అందుకే నైవేద్యం తర్వాత లభించేది ప్రసాదంగా భావిస్తాం.

ప్రసాదంలో మరో గొప్ప సందేశం ఉంది.. పంచుకోవడం. ఆలయంలో ప్రసాదం తీసుకునేటప్పుడు ఎదుటివారు ఎవరు, వారి స్థాయి ఏమిటి అనే తేడా ఉండదు. అందరికీ ఒకే ప్రసాదం. ఆ చిన్న ప్రసాదం మనిషికి సమానత్వాన్ని గుర్తు చేస్తుంది. మన దగ్గర ఉన్నదాన్ని ఇతరులతో పంచుకుంటేనే దానికి అసలైన ఆనందం ఉంటుందని చెబుతుంది.

చాలాసార్లు పిల్లలు ప్రసాదం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తారు. వారికి అది ఒక రుచికరమైన తినుబండారం కావచ్చు. కానీ అదే సమయంలో పెద్దలు దాని వెనుక ఉన్న భావాన్ని చెబితే.. చిన్న వయసులోనే ఒక మంచి సంస్కారం వారికి అలవడుతుంది. "ప్రసాదాన్ని వృథా చేయకూడదు.. గౌరవంగా తీసుకోవాలి.. ఇతరులతో పంచుకోవాలి" అనే చిన్న మాటలే భవిష్యత్తులో విలువలుగా మారవచ్చు.

ప్రసాదం విషయంలో మన సంప్రదాయంలో మరో అందమైన భావన ఉంది. మనం దేవుడికి ఏదైనా సమర్పించిన తర్వాత తిరిగి అదే మనకు ప్రసాదంగా లభిస్తుంది. అంటే మనిషి తన దగ్గర ఉన్నదాన్ని సమర్పించి.. దైవానుగ్రహంగా తిరిగి స్వీకరిస్తున్నాడు. ఇందులో కోల్పోవడం కంటే కృతజ్ఞత ఎక్కువ. "నాకు లభించినదంతా ఒక వరమే" అనే భావన మనసులో పెరిగితే జీవితం పట్ల మన దృష్టి కూడా మారుతుంది.

అందుకే ప్రసాదం చిన్నదా, పెద్దదా అనేది ముఖ్యం కాదు. దాన్ని స్వీకరించే మనసులో ఉన్న భక్తి ముఖ్యం. కొద్దిగా లభించినా సంతోషంగా తీసుకోవడం, వృథా చేయకుండా గౌరవించడం, ఇంటికి తీసుకెళ్లి అందరితో పంచుకోవడం.. ఇవన్నీ మన సంస్కృతిలోని మంచి విలువలను ప్రతిబింబిస్తాయి.

ఆలయానికి వెళ్లినప్పుడు దేవుడి దర్శనం మన కళ్లకు ఆనందాన్ని ఇస్తే.. ప్రసాదం మన చేతుల్లోకి వచ్చే దైవానుగ్రహానికి గుర్తుగా నిలుస్తుంది. అందుకే చిన్నదైన ప్రసాదం కూడా భక్తుడి మనసులో పెద్ద స్థానం సంపాదిస్తుంది.

ప్రసాదం రుచి నాలుకకు కొద్దిసేపే ఉంటుంది.. కానీ దాని వెనుక ఉన్న కృతజ్ఞత, పంచుకునే భావం, దైవంపై నమ్మకం మాత్రం జీవితాంతం నిలిచే విలువలు. అందుకే ప్రసాదాన్ని తినడం మాత్రమే కాదు.. దాని వెనుక ఉన్న భావాన్ని అర్థం చేసుకోవడం కూడా ఒక ఆధ్యాత్మిక అనుభూతే.



--- సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

# రాజకీయ మూసకట్టుపై జంతర్ మంతర్ పిడుగు!

## దారి తెన్ను లేని ద్వంద్వ రాజకీయం

ఏదైనా ఒక సామాజిక లేదా ప్రజా ఉద్యమం ప్రాణవాయువు పీల్చుకున్నప్పుడు, అది ఎంత పెద్దగా నినాదాలు చేసిందనే దానికంటే కూడా సమాజంలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన నిశ్శబ్దాలను, పాలకుల మౌనాన్ని ఏ మేరకు బద్దలు కొట్టిందనేదే అత్యంత ముఖ్యమైన అంశం. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ సాక్షిగా విద్యార్థులు, "జెన్ జీ" తరం లేవనెత్తిన ఆక్రోశం కేవలం ధర్నా వేదికలకే పరిమితం కాలేదు. అది దేశాన్ని ఏలుతున్న, అలాగే ఏలాలని కలలు కంటున్న రెండు ప్రధాన రాజకీయ శక్తుల ముసుగులను నిర్దాక్షిణ్యంగా తొలిచివేసింది. ఈ నిరసనల సెగ రాజకీయ వేదికలకు తగిలాక --- పీఠంపై కూర్చున్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ), పునరుజ్జీవం కోసం తపిస్తున్న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ రూపురేఖలు ఎంత అసహాయంగా, వైరుధ్యాలతో నిండిపోయాయో జాతీయ రాజకీయ యవనికపై స్పష్టంగా బహిర్గతమైంది.

అధికార మత్తెక్కిన 'డబుల్ ఇంజిన్' ఐసియులోకి!

కేంద్రంలో వరుసగా మూడోసారి పీఠాన్ని అధిష్టించినంత మాత్రాన అన్నీ పద్ధతి ప్రకారం, ప్రజాదరణతో సాగిపోతున్నాయని భావిస్తే అది బీజేపీ చేసుకునే ఆత్మవంచనే అవుతుంది. శతాబ్దపు సుదీర్ఘ అధికార దాహాన్ని తీర్చుకున్న శ్రేణుల్లో ఇప్పుడు సృజనాత్మకత చచ్చిపోయి, తీవ్రమైన నిస్తేజం మరియు అహంకారం ఆవహించాయి. రాబోయే ఎన్నికల ముంగిట "యోగి-మోదీ డబుల్ ఇంజిన్" అంటూ ఉత్తరప్రదేశ్‌లో ఊదరగొట్టిన ప్రచారం, నేడు నిరంతరం బయటపడుతున్న పేపర్ లీక్‌ల కుంభకోణాలు మరియు ఉద్యోగ అభ్యర్థుల ఆగ్రహజ్వాలల ముందు తలవంచక తప్పడం లేదు.

ఉపాధి లేమి, విపరీతమైన ధరల మంట, వ్యవస్థాగత అవినీతి రాజకీయాల్లో కొత్తవేమీ కావు. కానీ, అంతర్జాతీయ పోరాటాలు, సుదూర ప్రాంతాల్లో జరుగుతున్న యుద్ధాలు తెచ్చిపెట్టిన ద్రవ్యోల్బణానికి తోడు, జంతర్ మంతర్ విద్యార్థుల ఉద్యమం లేవనెత్తిన విద్యా-ఉపాధి హక్కుల ప్రశ్నాస్త్రాలు బీజేపీ మార్కు "ఎలక్షన్ క్విక్-ఫిక్స్" ఉచిత పథకాలకు లేదా తక్షణ ఉపశమనాలకు చిక్కడం లేదు. గత 12 ఏళ్లలో జాతీయ విద్యా విధానం పేరిట ఎంతటి డాంబికాలు పలికినప్పటికీ, బీజేపీ ప్రభుత్వం సాధించిందేమిటి? విద్యాసంస్థలను స్వతంత్రంగా ఎదగనివ్వకుండా, నిధుల కోత విధిస్తూ, కేవలం తమ భావజాల ప్రాజెక్టులను బలవంతంగా రుద్దడానికి, రాజ్యాంగ బద్ధ సంస్థలను ఆక్రమించడానికే మొదటి ప్రాధాన్యమిచ్చారనే సత్యం నేడు విద్యావంతులైన యువతకు స్పష్టంగా అర్థమైంది.

దీనికి తోడు, అధికార బలంతో మాట్లాడే గొంతులను నిర్దాక్షిణ్యంగా నొక్కేయడం, యూపీలో మొదలుపెట్టి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలకు పాకిన క్రూరమైన "బుల్డోజర్ న్యాయం" విధానాలు మైనారిటీలలో భయాందోళనలు రేకెత్తించాయి. ఇవన్నీ చాలవన్నట్లు, అయోధ్య రామ్ మందిర్ చందా వసూళ్లలో బయటపడిన "చందా చోరీ" ఆరోపణలు బీజేపీ-ఆర్ఎస్ఎస్‌ల నైతికతను తీవ్రంగా దెబ్బతీశాయి. మరోవైపు యుజిసి నిబంధనలతో ఉడుకునెత్తురు చిందుతున్న కుల వివక్షల రచ్చ --- బీజేపీని పూర్తిగా డిఫెన్స్‌లోకి నెట్టాయి. ఒకప్పుడు తాను అత్యంత బలంగా నమ్ముకున్న 'మందిర్' (హిందూత్వ) మరియు 'మండల్' (సామాజిక న్యాయం/రిజర్వేషన్లు) అనే రెండు ప్రచార పునాదులపై బీజేపీ నేడు తీవ్రమైన ఆత్మరక్షణలో పడాల్సి వస్తోంది. కేంద్రంలో మోదీ-షా ద్వయం దెబ్బకు భయపడి ఢిల్లీ స్థాయిలో ఎవరూ పెదవి విప్పకపోవచ్చు, కానీ కిందిస్థాయిలో అసమ్మతి అగ్నిపర్వతంలా మండుతోంది. బీహార్‌లో సొంత పార్టీ ఘోర పరాజయాన్ని చూసి బీజేపీ నాయకులే సంబరాలు చేసుకోవడం, బెంగాల్‌లో ఓడిపోయిన ప్రత్యర్థులను చేర్చుకుని పార్టీ "తృణమూలీకరణ"కు గురికావడం ఇందుకు ప్రత్యక్ష నిదర్శనాలు. శ్రమించే క్షేత్రస్థాయి కార్యకర్తల కష్టాన్ని పక్కనబెట్టి, బయటి పొలిటికల్ కన్సల్టెన్సీల 'టూ-డూ లిస్ట్‌లు', పిఆర్ ఏజెన్సీల రేటింగ్‌ల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం పార్టీ అంతర్గత వినాశనానికి నాందిపలుకుతోంది.

పార్టీని వదిలేసి, ఒంటరి పోరు చేస్తున్న 'గాంధీ'!

ఇక రాజకీయాలకు తామే ఏకైక ప్రత్యామ్నాయమని భావించే కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మరీ విచిత్రంగా, అయోమయంగా ఉంది. రాహుల్ గాంధీ తన సొంత పార్టీ యంత్రాంగం కంటే వేగంగా, దూకుడుగా ముందుకు వెళ్తున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రధాని నివాసం ముందు నిరసనలు, బాధితులైన విద్యార్థుల హక్కుల కోసం పోలీస్ స్టేషన్ల ముందు ధర్నాలు, సుదీర్ఘమైన భారత్ జోడో యాత్రలు ఆయన వ్యక్తిగత ఇమేజ్‌ను, గ్రాఫ్‌ను గణనీయంగా పెంచాయి. కానీ, అసలు విడ్డూరం ఏంటంటే --- రాహుల్ గాంధీ సాధిస్తున్న ఈ వ్యక్తిగత పురోగతిలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత పాత్ర దాదాపు శూన్యం. కాంగ్రెస్ పార్టీ శతాబ్దపు బద్ధకంతో, అంతర్గత కుమ్ములాటల కోరల్లో చిక్కుకుని పూర్తిగా స్తంభించిపోయింది. ఎంతలా అంటే, స్వయంగా రాహుల్ గాంధీకే తన సొంత పార్టీ యంత్రాంగంపై ఏకోశానా నమ్మకం లేనట్లు ఆయన శైలి చూస్తే స్పష్టమవుతోంది. ఆయన చుట్టూ ఉన్న కోటరీలో కాంగ్రెస్ మూలాలు ఉన్న నాయకులు కాకుండా, పార్టీతో సంబంధం లేని ఆరాజకీయ వ్యక్తులే రాజ్యం ఏలుతున్నారు. "ఛత్రోం కీ గూంజ్" లాంటి విద్యార్థుల వేదికలపై కాంగ్రెస్ అధికారిక యువజన విభాగానికి స్థానం లేకుండా, రాహుల్ గాంధీ వ్యక్తిగత టీమ్ మాత్రమే హడావుడి చేయడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది.

పార్టీని పునాది స్థాయి నుంచి బలోపేతం చేయకుండా, దాని నిబంధనలను నమ్మకుండా రాహుల్ గాంధీ ఒంటరి పోరాటం చేయడం వల్ల కాంగ్రెస్ సంక్షోభం మరింత ముదురుతోంది. రాబోయే ఎన్నికల ముంగిట ఉన్న ఉత్తరప్రదేశ్ పిసిసి కమిటీని రద్దు చేసి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు పునర్నిర్మించకపోవడం, పంజాబ్‌లో కొట్టుకుచస్తున్న విభిన్న వర్గాలను ఏకం చేయలేకపోవడం పార్టీ అధిష్టానం చూపుతున్న అపారమైన నిర్లక్ష్యానికి, అలసత్వానికి పరాకాష్ట.

జంతర్ మంతర్ నుంచి వీచిన విద్యార్థుల ఉద్యమ గాలులు దేశ రాజకీయాల్లో నిద్రాణంగా ఉన్న నిజాలను తీవ్రమైన కాంతిలో చూపెట్టాయి. హఠాత్తుగా వచ్చిన ఆ వెలుగుల కాంతికి రెండు పార్టీల అధినేతల కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. సిద్ధాంతాల ముసుగులో అధికార గర్వంతో విర్రవీగుతున్న బీజేపీ ఒకవైపు, నాయకుడి ఇమేజ్‌పై మాత్రమే ఆధారపడి పార్టీ వ్యవస్థను గాలికి వదిలేసిన కాంగ్రెస్ మరోవైపు --- రెండూ తమ సొంత వైఫల్యాల గుప్పిట్లో చిక్కుకున్నాయి. మూసకట్టు రాజకీయాల నుంచి బయటపడి, ప్రజా సంక్షోభాలకు బాధ్యతాయుత సమాధానం వెతకకపోతే, ఈ విద్యార్థి ఉద్యమం విసిరిన ప్రశ్నలే ఈ రెండు పార్టీల భవిష్యత్తును కాలగర్భంలో కలిపేస్తాయి.





వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# వికాసం వైపు తెలంగాణ!

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. గత ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.8 వేల కోట్ల బకాయిలు పెట్టగా, వంద రోజుల్లోనే రూ.6 వేల కోట్లు చెల్లించామని వెల్లడించారు. ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధరించామని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేసిన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టినట్లు వివరించారు.

72 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

నిరుద్యోగుల కోసం తమ ప్రభుత్వం పెద్దఎత్తున ఉద్యోగ నియామకాలు చేపట్టిందని రేవంత్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో గ్రూప్-1, 2, 3, 4తో పాటు వైద్యులు, నర్సులు, పోలీసు ఉద్యోగాల భర్తీ జరగలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం రెండేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.

రైతు సంక్షేమానికి రూ.1.70 లక్షల కోట్లు

రైతుల సంక్షేమం కోసం వెయ్యి రోజుల పాలనలో రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని సీఎం తెలిపారు. 30 నెలల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు రూ.90 వేల కోట్లు చెల్లించామని, రైతు భరోసా కింద రూ.36 వేల కోట్ల పెట్టుబడి సాయం అందించామని చెప్పారు. 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని వెల్లడించారు. ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేశామని, సన్న వడ్లకు రూ.500 బోనస్ అందించామని వివరించారు.

మహిళలకు అండగా ప్రజా ప్రభుత్వం

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సీఎం అన్నారు. కోటి మంది మహిళలకు కోటి చీరలు అందించామని, స్వయం సహాయక సంఘాలకు రూ.60 వేల కోట్ల బ్యాంకు లింకేజీ కల్పించామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో పాటు ఆర్టీసీకి ప్రభుత్వం రూ.11 వేల కోట్లు చెల్లించిందన్నారు. వెయ్యి బస్సులను మహిళలకు యాజమాన్య హక్కుతో అందించే కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు.

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

నర్సరీ నుంచి 12వ తరగతి వరకు 27.50 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు టిమ్స్ ఆసుపత్రులను విస్తరిస్తున్నామని చెప్పారు. సనత్‌నగర్ టిమ్స్‌కు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి పేరు పెట్టామని, త్వరలో అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్‌లను ప్రారంభిస్తామని వెల్లడించారు. అల్వాల్ టిమ్స్‌కు మాజీ సీఎం టి. అంజయ్య, ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ప్రొఫెసర్ జయశంకర్ పేర్లు పెట్టనున్నట్లు ప్రకటించారు.

కులగణన.. ఎస్సీ వర్గీకరణ

సామాజిక న్యాయం విషయంలోనూ తమ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని సీఎం అన్నారు. 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించామని, 1931 తర్వాత దాదాపు వందేళ్లకు పైగా జరగని కులగణనను చేపట్టి లెక్కలు తేల్చామని పేర్కొన్నారు. గిగ్ వర్కర్ల సంక్షేమానికి చట్టం తీసుకురావడంతో పాటు స్పోర్ట్స్, ఐటీ, హెల్త్, టూరిజం, ఎండోమెంట్స్ పాలసీలను రూపొందించామని తెలిపారు.

మూడు ప్రాంతాలుగా తెలంగాణ అభివృద్ధి

హైదరాబాద్‌తో పాటు తెలంగాణను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని సీఎం వివరించారు. ఓఆర్ఆర్ లోపల కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీగా, ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాన్ని పెరీ అర్బన్ రీజియన్‌గా, ఆపై ప్రాంతాన్ని రూరల్ అగ్రికల్చర్ రీజియన్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు.

"ప్రజలు తేడాను గమనించాలి"

వెయ్యి రోజుల ప్రజా ప్రభుత్వ పాలనలో ఇన్ని కార్యక్రమాలు చేపట్టిన తర్వాత తమ ప్రభుత్వం విఫలమైందని ఎలా అంటారని సీఎం ప్రశ్నించారు. గత పాలనకు, ప్రస్తుత ప్రజా ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనించాలని కోరారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్లే ప్రయాణంలో ప్రజలంతా ప్రభుత్వానికి అండగా నిలవాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# భారత్--ఉజ్బెకిస్తాన్ బంధానికి కొత్త బలం

ప్రాంతీయ భద్రత వంటి అంశాల్లో భారత్, ఉజ్బెకిస్తాన్ పరస్పరం సహకరించుకుంటున్నాయి. ఇరు దేశాల సైనిక దళాలు సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్నాయి. దీనివల్ల ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం మరింత బలపడుతోంది.

ప్రాంతీయ భద్రతకు ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనే విషయంలోనూ పరస్పర సమన్వయం పెంచుకోవాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి.

వాణిజ్యానికి రవాణా మార్గాలే కీలకం

భారత్, ఉజ్బెకిస్తాన్ మధ్య వాణిజ్యాన్ని పెంచడంలో రవాణా అనుసంధానం ప్రధాన అంశంగా మారింది. సముద్రానికి నేరుగా చేరుకునే అవకాశం లేని మధ్య ఆసియా దేశాలకు ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాల అవసరం ఉంది.

ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని చాబహార్ నౌకాశ్రయం, అంతర్జాతీయ ఉత్తర--దక్షిణ రవాణా మార్గం కీలకంగా మారాయి. వీటి ద్వారా భారత్ నుంచి ఉజ్బెకిస్తాన్‌తో పాటు ఇతర మధ్య ఆసియా దేశాలకు సరుకుల రవాణా సులభతరం చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఇంధన రంగంలోనూ దృఢమైన బంధం

ఇరు దేశాల మధ్య ఇంధన రంగంలో సహకారం కూడా పెరుగుతోంది. ఉజ్బెకిస్తాన్ నుంచి భారత్‌కు యురేనియం సరఫరా ఒప్పందాలు ఇంధన భద్రతకు ప్రాధాన్యత కలిగినవిగా మారాయి.

అదేవిధంగా భారతదేశం సాధించిన సాంకేతిక, సమాచార రంగాల పురోగతిని ఉజ్బెకిస్తాన్‌లో వినియోగించేందుకు సహకారం అందిస్తోంది. ముఖ్యంగా నగదు రహిత చెల్లింపులు, సమాచార సాంకేతిక సేవలు వంటి రంగాల్లో భారత అనుభవాన్ని అక్కడ ఉపయోగించుకునే అవకాశాలు పెరుగుతున్నాయి.

వైద్య రంగంలో విస్తరిస్తున్న పెట్టుబడులు

వైద్య రంగంలోనూ ఇరు దేశాల మధ్య సహకారం గణనీయంగా పెరుగుతోంది. ఆస్పత్రుల ఏర్పాటు, ఔషధ తయారీ, వైద్య సేవలు, వైద్య పర్యాటకం వంటి రంగాల్లో భారతీయ సంస్థలు ఉజ్బెకిస్తాన్‌లో పెట్టుబడులు పెడుతున్నాయి.

తక్కువ వ్యయంతో నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో భారత్‌కు ఉన్న అనుభవం ఉజ్బెకిస్తాన్‌కు ఉపయోగపడుతోంది.

విద్య, సంస్కృతితో మరింత దగ్గర

విద్య, సాంస్కృతిక రంగాల్లోనూ ఇరు దేశాల మధ్య బంధం బలపడుతోంది. ఉన్నత విద్య కోసం ఇరు దేశాల విద్యార్థులు పరస్పరం ఆయా దేశాలకు వెళ్తున్నారు. భారతీయ విద్యా సంస్థలు ఉజ్బెకిస్తాన్‌లో తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నాయి.

# సీపీఎస్ రద్దు కోరుతూ నవంబర్ 17న సామూహిక సెలవు:



నిర్మల్, సెప్టెంబర్ 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) వెంటనే పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం భూమన్న, బి. రామారావు డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం అమల్లోకి వచ్చి 22 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం జిల్లావ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా నవంబర్ 17న రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన సామూహిక సెలవు (మాస్ సీఎల్) పోరాటానికి ఉద్యోగులంతా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర బాధ్యులు పంతిక రేవంత్, జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కనకాపూర్ గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇళ్లకు ఘనంగా భూమిపూజ



లక్ష్మణచాంద, సెప్టెంబర్ 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): లక్ష్మణచాంద మండల పరిధిలోని కనకాపూర్ గ్రామంలో ప్రభుత్వం నుంచి నూతనంగా మంజూరైన ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులకు మంగళవారం ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంద్ర నరేష్ రెడ్డి, ఆత్మ చైర్మన్ రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి, సర్పంచ్ రాజ్యలక్ష్మి రాజు హాజరై పనులను ప్రారంభించారు. పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, ఉపసర్పంచ్ డి. శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు రాకేష్, ప్రమోద్, కప్పకంటి మోహన్, మల్లికార్జున్, రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ధర్మారంలో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాల పరిశీలన



లక్ష్మణచాంద, సెప్టెంబర్ 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): లక్ష్మణచాంద మండలంలోని ధర్మారం గ్రామంలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను మంగళవారం విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) మహేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని పలు వీధుల్లో సిమెంట్ స్తంభాల పెచ్చులు ఊడిపోయి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తూ కూలిపోయే స్థితిలో ఉన్నాయని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఏఈ సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించి వేలాడుతున్న విద్యుత్ తీగలను పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన స్తంభాల స్థానంలో తక్షణమే నూతన స్తంభాలను ఏర్పాటు చేసి తీగలను సరిచేయాలని లైన్ ఇన్స్పెక్టర్ గంగాధర్, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుర్క ముత్యం, ఉపసర్పంచ్ గజ్జేల ఉదయశ్రీ శ్రీకాంత్, సాయి పాల్గొన్నారు.

# పందుల పంజా.. కోతుల కాటకం!

## ఏళ్లుగా ఇదే తంతు.. ప్రజల గోడు పట్టని అధికారులు!

దిలావర్‌పూర్, సెప్టెంబర్ 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ప్రజలకు పందులు, కోతుల బెడద తీవ్ర ఇబ్బందిగా మారింది. ఒకవైపు పందులు గుంపులుగా వీధుల్లో సంచరిస్తుండగా.. మరోవైపు కోతులు ఇళ్లపై, నివాస ప్రాంతాల్లో విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఏళ్లుగా సమస్య కొనసాగుతున్నా అధికారులు శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**వీధుల్లో పందుల స్వైరవిహారం**

మండల కేంద్రంలోని పలు వీధుల్లో పందులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. ఇళ్ల ముందు, ప్రధాన రహదారులు, జనావాసాల మధ్య గుంపులుగా తిరుగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులు రోడ్లపైకి రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. పందుల కారణంగా పలువురు గాయపడిన సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. పందుల సంచారాన్ని అరికట్టాలని గతంలో గ్రామస్తులు అధికారులను పలుమార్లు కోరారు. సమస్య పరిష్కారం కోసం మండల కార్యాలయం ఎదుట ధర్నా సైతం నిర్వహించారు. అనంతరం అధికారులు, గ్రామ పెద్దలు, పందుల పెంపకందారులతో చర్చలు జరిపారు. గ్రామంలో పందులను సంచరించకుండా చర్యలు తీసుకుంటామని హామీలు ఇచ్చారు. అయితే సంవత్సరాలు గడుస్తున్నా పరిస్థితిలో మాత్రం మార్పు రాకపోవడం గమనార్హం.

**ధర్నా చేసినా.. చర్చలు జరిపినా!**

ప్రజలు రోడ్డెక్కి ఆందోళన చేసిన సమయంలో అధికారులు హడావుడిగా స్పందించినా.. ఆ తర్వాత సమస్యను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. పందుల పెంపకందారులతో చర్చలు జరిపినప్పటికీ వాటిని గ్రామంలోకి రాకుండా కట్టడి చేయడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు.

ధర్నా చేయాలి.. ఫిర్యాదు చేయాలి.. అధికారులు వచ్చి హామీ ఇవ్వాలి.. మళ్లీ సమస్య యథావిధిగా కొనసాగాలి అన్నట్లుగా పరిస్థితి తయారైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల భద్రతకు సంబంధించిన సమస్యను కూడా అధికారులు ఇంత నిర్లక్ష్యంగా తీసుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

**ఇళ్లపై కోతుల దాడులు**

పందుల సమస్యకు తోడు కోతుల బెడద కూడా దిలావర్‌పూర్ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. గుంపులుగా గ్రామంలోకి వస్తున్న కోతులు ఇళ్లలోకి చొరబడుతున్నాయి. ఇంట్లో ఉంచిన వంట సామగ్రి, ఆహార పదార్థాలను ఎత్తుకెళు_న్నాయని మహిళలు చెబుతున్నారు. ఇంటి పైకప్పులపైకి ఎక్కి పెంకులు, ఇతర సామగ్రిని చెల్లాచెదురు చేస్తున్నాయని వాపోతున్నారు. కోతులను తరిమేందుకు ప్రయత్నించిన సమయంలో అవి తిరిగి ప్రజలపైకి దూసుకొచ్చే పరిస్థితులు కూడా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు. కోతుల బెడదను అరికట్టేందుకు అటవీ శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





**ప్రజలే జాగ్రత్త పడాలా?**

ఒకవైపు పందులు.. మరోవైపు కోతులు.. మధ్యలో ప్రజల అవస్థలు అన్నట్లుగా మండల కేంద్రంలో పరిస్థితి తయారైంది. పారిశుధ్యం, ప్రజల భద్రత, జంతువుల నియంత్రణ వంటి అంశాలపై సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉన్నా.. ఎవరి బాధ్యత ఏమిటన్న దానిపై స్పష్టత లేకపోవడంతో సమస్య మరింత తీవ్రమవుతోందని గ్రామస్తులు అంటున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందే చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత కాదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పందుల కారణంగా గాయపడిన ఘటనలు ఉన్నప్పటికీ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ఇకనైనా కదలిక రావాలి**

దిలావర్‌పూర్‌లో పందుల సంచారాన్ని పూర్తిగా అరికట్టడంతో పాటు కోతుల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు సంబంధిత అధికారులు వెంటనే కార్యాచరణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పందుల పెంపకందారులకు స్పష్టమైన నిబంధనలు విధించి, వాటిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదే విధంగా కోతులను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యకు ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపుతారా? లేక మరోసారి హామీలతోనే సరిపెడతారా? అని దిలావర్‌పూర్ ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు. ప్రజలు ఆందోళనకు దిగిన తర్వాత కాకుండా.. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# నిర్మల్ లో నర్సరీ నారుతో.. రైతులు తస్మాత్ జాగ్రత్త..!

## మొక్క నారు మాటున లాభాల దందా..!
## నర్సరీలు పదులు, పర్యవేక్షణ పది..?

నిర్మల్, ఆగస్టు 31 తెలంగాణ వెన్నెల వాక్కు

వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రైతులు నర్సరీ నారు విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. నిర్మల్ జిల్లా పరిధిలోని నిర్మల్ ,భైంసా, ఖానాపూర్, నర్సాపూర్ ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా నర్సరీలు వెలుస్తుండగా, వాటిలో నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నారా..? లేదా అన్నదానిపై చర్చ జరుగుతోంది. నారు విక్రయానికి సంబంధిత అనుమతులు, లైసెన్స్ తదితర అంశాలను రైతులు పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్, నర్సాపూర్ పరిధిలో ఇప్పటికే 10 దాటి నర్సరీలు ఏర్పాటైనట్లు తెలుస్తోంది. రైతులకు అవసరమైన వివిధ రకాల మొక్కల నారును అందిస్తున్న నిర్వాహకులు నాణ్యత, ధర విషయంలో స్పష్టత పాటించాల్సిన అవసరం ఉంది. అయితే కొన్నిచోట్ల నారు ధరలను పెంచి రైతుల పై అదనపు భారం మోపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెట్టుబడులు పెరుగుతున్న నేపథ్యంలో నారు ధరలు కూడా పెరగడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

**లైసెన్స్ ఉందా..? ముందుగా పరిశీలించాలి**

నర్సరీ నుంచి నారు కొనుగోలు చేసే సమయంలో రైతులు సంబంధిత నర్సరీకి అనుమతులు, లైసెన్స్ ఉన్నాయా లేదా అన్నది తెలుసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. లైసెన్స్ లేకుండా నారు బయటకు విక్రయించడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటున్నారు. నారు నాణ్యత, రకం, ధర తదితర వివరాలను తెలుసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలని చెబుతున్నారు.

**నాణ్యతపై రైతుల ఆందోళన**

నారు నాణ్యతలో తేడా ఉంటే పొలంలో నాటిన తర్వాత మొక్కలు సరిగా ఎదగకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. ఒకవైపు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు పెరుగుతుండగా.. మరోవైపు నారు ధరలు కూడా పెరగడం రైతులకు భారంగా మారుతోంది. నారు కొనుగోలు సమయంలోనే రశీదు తీసుకోవాలని, అనుమతులు ఉన్న నర్సరీల నుంచే నారు కొనుగోలు చేయాలని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు.



**అధికారుల పర్యవేక్షణ ఏది..?**

నిర్మల్ జిల్లాలోని నిర్మల్ ,భైంసా, ఖానాపూర్, నర్సాపూర్ ప్రాంతాలలో నర్సరీల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నర్సరీల అనుమతులు, లైసెన్సులు, నారు నాణ్యత, విక్రయ ధరలను పరిశీలించాలని రైతులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న నర్సరీలపై చర్యలు తీసుకోవాలని, రైతులకు నష్టం కలగకుండా పర్యవేక్షణను మరింత పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అధిక ధరలకు నారు విక్రయించే పరిస్థితులకు అడ్డుకట్ట వేయాలని, అనుమతులు లేని నర్సరీలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

**నారు విక్రయాల్లో నిబంధనలు పాటించాలి**

నిర్మల్ జిల్లా పరిధిలో నర్సరీలు పెరుగుతున్న నేపథ్యంలో నారు విక్రయాలు, నర్సరీల లైసెన్స్ లేకుండా నర్సరీలు నిర్వహిస్తూ నారు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నారు విక్రయాల సమయంలో నర్సరీల నిర్వాహకులు సంబంధిత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. లైసెన్స్ లేకుండా నర్సరీలు నిర్వహిస్తున్న నిర్వాహకులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామని తదుపరి చర్యలు తీసుకుంటామని ఉద్యానాధికారి తెలపడం విశేషం. నర్సరీ నిర్వహణ, నారు ఉత్పత్తి, విక్రయాల విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటించి తీరాల్సిందేనని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా నర్సరీలను నిర్వహించడం, నిబంధనలకు విరుద్ధంగా నారు విక్రయించడం వంటి చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నర్సరీల నిర్వాహకులు నిబంధనలు పాటించకపోతే రూ. 50 వేలు జరిమానా, జైలు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు.



## పెండింగ్ భూ సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా




నిర్మల్, సెప్టెంబర్ 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో అత్యంత వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూభారతి, భూముల రీ-సర్వే, నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, సీఎంఆర్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆయన విస్తృత సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా 22-ఏ నిషేధిత జాబితా కింద ఉన్న భూ వివాదాలను నిశితంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్లకు సూచించారు. గ్రామసభలు నిర్వహించిన అనంతరమే రీ-సర్వే ప్రక్రియను ప్రారంభించాలని, ఇందుకు సంబంధించి అదనంగా ఐదు అధునాతన సర్వే యంత్రాలను సమకూరుస్తున్నట్లు తెలిపారు. రేషన్ డీలర్ల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన స్మార్ట్ రేషన్ కార్డులు అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## బీజేపీ నేతల అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నిర్మల్, సెప్టెంబర్ 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు, బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ నిర్మల్ జిల్లా కేంద్రంలో బీజేపీ శ్రేణులు భగ్గుమన్నాయి. మంగళవారం నిర్మల్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా భారీ నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని నాయకులు మండిపడ్డారు. రాజకీయ కక్షసాధింపు చర్యలతో ప్రతిపక్షాల గొంతు నొక్కలేరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మెడిశెమ్మ రాజు, సాదం అరవింద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దొడ్డికింది నిరంజన్ రెడ్డి, కౌన్సిలర్లు గంజి రాజు, కూన శశాంక్, సాత్విక్, ఈశ్వర్, మాజీ కౌన్సిలర్ బి. నవీన్, నాయకులు వెంకటేష్, ఉదయ్, సాయిరెడ్డి, విజయ్, ఒడ్నాల రాజు, భరత్, హరీష్ పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దు కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఉద్యోగుల గర్జన



నిర్మల్, సెప్టెంబర్ 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను (సీపీఎస్) తక్షణమే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో నిర్మల్ కలెక్టరేట్ ప్రాంగణంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు గర్జించారు. మంగళవారం 'పెన్షన్ విద్రోహ దినం' సందర్భంగా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ వెలమల ప్రభాకర్ మాట్లాడుతూ సీపీఎస్ అమలుతో ఉద్యోగుల జీవితాలకు సామాజిక, ఆర్థిక భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం వెంటనే ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గజిటెడ్ అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల జిల్లా నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 3 రోజుల పోరుబాట



లక్ష్మణచాంద, సెప్టెంబర్ 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్మల్ నియోజకవర్గంలో పోరుబాట నిరసనలు చేపడుతున్నట్లు మండల కన్వీనర్ కోరిపెల్లి కృష్ణారెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 2న ఆరు గ్యారెంటీల వైఫల్యాలపై నిర్మల్‌లో రాంకిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా, బాకీ కార్డుల పంపిణీతో పాటు 425 అడుగుల భారీ ఫ్లెక్సీ ప్రదర్శన ఉంటుందన్నారు. సెప్టెంబర్ 3న యూరియా కొరత, రైతు భరోసా, సాగునీటి సమస్యలపై రైతుల పక్షాన ఆందోళన చేపడతామని చెప్పారు. సెప్టెంబర్ 4న మహిళలకు రూ. 2,500, కేసీఆర్ కిట్, మహాలక్ష్మి, స్కూటీల హామీల అమలుపై జిల్లా కేంద్రంలో మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోవద్దు: కూచాడి శ్రీహరిరావు



సారంగాపూర్, సెప్టెంబర్ 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ముసాయిదా జాబితా నుంచి అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరిరావు కోరారు. మంగళవారం సారంగాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఓటరు అవగాహన గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు, వయస్సు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు దొర్లితే సంబంధిత పత్రాలతో బీఎల్‌వోలను సంప్రదించి వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. బూత్ లెవల్ ఏజెంట్లు ప్రజలకు అందుబాటులో ఉండి సహకరించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు జాబితాలో ఉండేలా చూడటం అధికారుల బాధ్యత అని, బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## బాధిత కుటుంబానికి రూ. 2.50 లక్షల ఎల్ఓసీ చెక్కు అందజేత



. మామడ/నిర్మల్, సెప్టెంబర్ 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేద కుటుంబానికి మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ. 2.50 లక్షల ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) చెక్కును కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరిరావు మంగళవారం అందజేశారు. మామడ మండలం పొన్కల్ గ్రామానికి చెందిన నర్సయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా, కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు శ్రీహరిరావు ప్రభుత్వం నుంచి సత్వరమే ఎల్ఓసీ మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లింగన్న, అనంతపేట్ సర్పంచ్ తిరుమల్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ సెక్షన్--30 అమలు: ఎస్పీ జానకి షర్మిల




నిర్మల్, సెప్టెంబర్ 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా ప్రశాంతతను దృష్టిలో ఉంచుకుని సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ సెక్షన్--30 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. సెక్షన్--30 అమలులో ఉన్నందున పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు, ఊరేగింపులు, నిరసన ప్రదర్శనలు, బహిరంగ సభలు మరియు సమావేశాలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికల్లో రెచ్చగొట్టే పోస్టులు, వదంతులు, మత విద్వేషాలు వ్యాప్తి చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ప్రజలు చట్టాన్ని గౌరవించి పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.

## విద్యార్థుల్లో ఆచరణాత్మక బోధనతోనే సృజనాత్మకత: కలెక్టర్ భవేష్ మిశ్రా



తానూరు, సెప్టెంబర్ 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): పుస్తక పరిజ్ఞానంతో పాటు ప్రాక్టికల్ విద్యాబోధనతోనే విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తి పెరుగుతాయని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. మంగళవారం తానూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులు, వసతిగృహం, పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి గణిత ప్రశ్నలు వేసి సరైన జవాబులు చెప్పిన వారికి పెన్నులను బహుమతిగా ఇచ్చారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.



అంతకుముందు మొగిలి గ్రామంలో పీఏసీఎల్ భూ బాధితులతో సమావేశమై వివరాలు సేకరించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డీఈవో భోజన్న, తహసీల్దార్ మహేందర్‌నాథ్, ఎంపీడీవో శ్రీధర్, ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-